క్లుప్తంగా

జగ్జీవన్ రామ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ముధోల్: స్వాతంత్ర్య సమరయోధుడు జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, పీఏసీఎస్ డైరెక్టర్ సుదర్శన్, నాయకులు దేవోజీ భూమేశ్, తాటివార్ రమేశ్, మోహన్‌యాదవ్, జీవన్, జంబుల సాయిప్రసాద్, బతినోళ్ల సాయి, లవన్, మోచి సంఘం సభ్యులు ఉన్నారు.

నేడు చెక్కులు పంపిణీ

లోకేశ్వరం: మండలకేంద్రంలోని రైతువేదికలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని తహసీల్దార్ సర్ఫరాజ్ అహ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రాయితీ సద్వినియోగం చేసుకోవాలి

సారంగపూర్: ఆయిల్‌పాం సాగు చేసే రైతులు బిందుసేద్యం పరికరాల కోసం దరఖాస్తు చేసుకొని రాయితీని సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ డివిజన్ ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ అధికారిణి సాదుల మౌనిక అన్నారు. మండలంలోని గోపాల్‌పేట్ గ్రామంలో ఆదివారం ఆయిల్‌పాం ప్లాంటేషన్ చేపట్టారు. ఆయిల్‌పాం తోటలో అంతర పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. నర్సరీ మేనేజర్ మనోజ్, క్లస్టర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, రైతులు చిన్నయ్య, నర్సయ్య ఉన్నారు.

యువతి అదృశ్యం



అంకిత (ఫైల్)

తానూరు: మండలకేంద్రం పరిధిలో ఆదివారం యువతి అదృశ్యం కాగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన సాక్రే అంకిత (18) అనే యువతి మూడు నెలలుగా మండలంలోని హిప్నెల్లి గ్రామంలో వరుసకు చిన్నాన్న అయ్యే శివకుమార్ ఇంట్లో ఉంటోంది. ఆదివారం శివకుమార్ కుటుంబసభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లారు. చేను వద్ద కలుపు మొక్కలు తీసి వస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన అంకిత తిరిగి రాలేదు. చుట్టుపక్కల, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో శివకుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

భైంసాటౌన్: పట్టణంలోని నర్సింహానగర్‌కు చెందిన కల్యాణ్‌కర్ శంకర్ (45) అనే వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. శంకర్ ఇటీవల ఇంటిపై నుంచి మెట్లు దిగుతూ జారిపడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలవగా కుటుంబీకులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సారంగపూర్: తమ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణ హామీ నెరవేర్చినందుకు ఆదివారం మండలంలోని మహావీర్‌తండాలో గ్రామస్తులు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు నరేశ్ మాట్లాడుతూ మహావీర్‌తండా ప్రజల ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా రూ.3కోట్లతో రోడ్డు నిర్మించారని తెలిపారు. బీజేపీ నాయకులు శ్రావణ్‌కుమార్, తోట భోజన్న, సాగర్‌రెడ్డి, చెన్న రాజేశ్వర్, విలాస్, తిరుమలచారి, అంబాజీ ఉన్నారు.

రోడ్లను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు

లోకేశ్వరం: కేజీవీల్స్‌తో కూడిన ట్రాక్టర్లను నడిపి రోడ్లను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై అశోక్ అన్నారు. ఆదిదివారం మండలంలోని పంచగుడి అంబేద్కర్ చౌరస్తా వద్ద కేజీవీల్స్ ట్రాక్టర్‌ను తీసుకెళ్లే ట్రాలీని ఎస్సై ప్రారంభించి మాట్లాడారు. రోడ్లు దెబ్బతినకుండా ట్రాక్టర్ యజమానులు నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాక్టర్ యాజమానులు రహీంపటేల్, బాజన్న, నాగన్న ఉన్నారు.

బురద రోడ్లపై వెళ్లేదెలా?



బురదమయంగా మిద్దెచింతకు వెళ్లే రోడ్డు



ఇస్లాంపూర్‌కు వెళ్లే దారి

కడెం: దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి ఏళ్లు గడుస్తున్నా.. అటవీశాఖ నిబంధనల కారణంగా కడెం మండలంలోని మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించలేదు. ఈ అటవీ ప్రాంతాలకు మట్టి రోడ్లే దిక్కు. ఏటా వర్షాకాలంలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మట్టి రోడ్లు బురదమయమై అధ్వానంగా మారుతాయి. అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లేవారి కష్టాలు వర్ణనాతీతం. ఉదుంపూర్ పంచాయతీ పరిధిలోని మిద్దె చింత, ఇస్లాంపూర్ పంచాయతీలోని పరిధిలోని పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రోడ్లు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

రావి మొక్క తొలగించరూ..

లోకేశ్వరం: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ భవనం గోడలో మొలిచిన రావి మొక్కను తొలగించాలని ప్రజలు పేర్కొంటున్నారు. చెట్టుగా మారి గోడలు కూలిపోక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆదమరిస్తే అంతే..



సారంగపూర్: బోథ్ నుంచి సారంగపూర్ వెళ్లే రోడ్డు మార్గంలో అడెల్లితండా సమీపంలో కాల్వపై నిర్మించిన హైలెవల్ వంతెన వద్ద ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. గతేడాది వర్షాలకు వంతెన వద్ద ఓవైపు రోడ్డు సగం వరకు కోతకు గురైనా.. మరమ్మతులు చేపట్టలేదు. వంతెనకు మరోవైపు మొరం కొట్టుకుపోయి సీసీ రోడ్డు కుంగిపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వంతెనకు ఇరువైపులా మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయాల్లో తొలిఏకాదశి పూజలు



కుంటాల: ఓలా విఠలేశ్వరస్వామి ఆలయంలో..



కుభీర్‌లో అభిషేకంలో పాల్గొన్న భక్తులు



లోకేశ్వరం : భాగాపూర్‌లో..



ముధోల్: విఠోలిలో పూజలు చేస్తున్న భక్తులు



హరిహర క్షేత్రంలో పూజ నిర్వహిస్తున్న భక్తులు



భైంసారూరల్: ఖథ్‌గాం గ్రామంలో విఠల రుక్మాబాయి ఆలయం వద్ద క్యూలో భక్తులు

కుభీర్:తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని మండలకేంద్రంలోని శ్రీవిఠలేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢమాసంలో వచ్చే ఏకాదశిని హిందువులు తొలి పండుగగా భావిస్తారు. సమీప గ్రామాల ప్రజలు ఆలయానికి వచ్చి పూజలు చేయగా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో శ్రీ విఠల రుక్మాబాయి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు నిర్వహించారు. గందే పరివార్ కుటుంబసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కుంటాల:మండలంలోని సూర్యాపూర్ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

భైంసారూరల్: మండలంలోని మహాగాం, ఖథ్‌గాం గ్రామాల్లోని విఠలరుక్మాబాయి ఆలయాలకు వెళ్లి భక్తులు పూజలు చేశారు.

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని వైష్ణవ ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవరకోట దేవస్థానం, వాల్మీకి నగర్ శ్రీ రామాలయం, హరిహర క్షేత్రం మల్లన్నగుట్ట ఆలయంలో మూలవిరాట్, ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. దేవరకోట దేవస్థానంలో శ్రీ అండాల్ గోష్టి శ్రీ వైష్ణవ సేవా సంఘం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్ర పారాయణం, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి అష్టోత్తర పూజలు చేశారు. శ్రీనివాసాచారి, శ్రీదేవి, రాజులదేవి రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

ముధోల్: మండలకేంద్రంలోని హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి మందిరంలో ఉత్సవ కమిటీ సభ్యులు, పశుపతినాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

లోకేశ్వరం: మండలంలోని బాగాపూర్ గ్రామ రాజ్యలక్ష్మిసహిత లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, సహస్ర తులసి పుష్పాలతో అష్టోత్తర పూజలు జరిపించారు. అర్చకుడు నరసింహస్వామి, భక్తులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాల ఎన్నిక



ఎన్నికైన మున్నూరుకాపు కార్యవర్గం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బుధవార్‌పేట్ మున్నూరుకాపు సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మారుగోండ నరేందర్, ఉపాధ్యక్షుడిగా అనుముల మోహన్, ప్రధాన కార్యదర్శిగా ఉదగిరి పోశెట్టి, సంయుక్త కార్యదర్శిగా అనుముల రాజేశ్వర్, కోశాధికారిగా లక్కాకుల గిరిధర్, కార్యవర్గ సభ్యులుగా మగ్గిడి వెంకటి, బొమ్మెడ కిషన్, కుమ్మరి వెంకటి, సల్ల కిషన్, అనుముల రాజేందర్, అయిండ్ల రాజస్వామి, బసవేశ్వర్, ఆదుముల్ల నారాయణ ఎన్నికయ్యారు. బద్రి శ్రీనివాస్, ఎర్రవోతు ముత్తన్న, కొబ్బయి శేషాద్రి, కుమ్మరి ఆనంద్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేసిన నూతన కార్యవర్గాన్ని శాలువా, పూలమాలతో సత్కరించారు.



ఎన్నికైన యాదవ సంఘ కార్యవర్గం

యాదవ సంఘం..

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణ యాదవ సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ భవనంలో ఎన్నుకున్నారు. యాదవ సంఘం పట్టణ అధ్యక్షుడిగా జాంపేల్లి శ్రీనివాస్ యాదవ్, గౌరవ అధ్యక్షులుగా ఇవి రమేశ్ యాదవ్, మంచాల శ్రీకాంత్ యాదవ్, ఉపాధ్యక్షులుగా పిండి మల్లేశ్, సాయన్న యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మంచాల ఆనంద్ యాదవ్, కోశాధికారిగా నరహరి యాదవ్, గౌరవ సలహా సభ్యులుగా అంబటి మహేందర్ యాదవ్, అనంతుల లక్ష్మణ్, డాక్టర్ మురళీధర్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను పలువురు శాలువా, పూలమాలలతో సన్మానించారు.

‘మొక్కలు తొలగించిన వారిపై కేసు పెట్టాలి’

లక్ష్మణచాంద: మండలంలోని బోరిగాం తండా పల్లె ప్రకృతివనంలో మొక్కలు తొలగించిన వారిపై కేసులు నమోదు చేయాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ కొరిపెల్లి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన బోరిగాం తండా పల్లె ప్రకృతివనం పరిశీలించి మాట్లాడారు. పకృతి వనంలోని మొక్కలను అధికార పార్టీ వారే ధ్వంసం చేశారని ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఎంపీడీవో రాధ, ఎ స్సై శ్రీనివాస్, తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మహేశ్, భూమేశ్, ఇంద్రకరణ్‌రెడ్డి, చిన్నయ్య, వాహిద్ ఉన్నారు.



ప్రకృతివనం పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి

సమస్యలు పరిష్కరించేందుకే మార్నింగ్‌వాక్

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఖానాపూర్: ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే మార్నింగ్‌వాక్ కార్యక్రమం చేపడుతున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధిలోని చింతల్‌పేట్, బాదనకుర్తి గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి మార్నింగ్ వాక్ చేస్తూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. తెల్లవారుజామున 5:30 గంటలకే గ్రామానికి వెళ్లి పర్యటించారు. ఈసందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు, రేషన్‌కార్డుల దరఖాస్తులు, ఉచిత విద్యుత్, మహాలక్ష్మీ వంటి పథకాల అమలుపై ప్రజలతో మాట్లాడారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఎంఏ మాజిద్, ఎస్‌కే సాజిద్, మాసుల లక్ష్మిరాజం, గుడాల రాజన్న, దొంతుల గంగరాజం, గంగారెడ్డి, ఎనగంటి హరి, శంకర్, రాజన్న, గంగన్న, పంచాయతీ కార్యదర్శి సురేందర్ తదితరులు ఉన్నారు.



బాదనకుర్తిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఆలయాలకు నిధుల మంజూరు

ఖానాపూర్: నియోజకవర్గంలోని ఖానాపూర్, కడెం , పెంబి మండలాల్లోని పలు ఆలయాలకు దేవాదాయ శాఖ నుంచి నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఓ ప్రకటనలో తెలిపారు. ఖానాపూర్ మండలంలోని బావాపూర్(కె) గ్రామంలో బీరప్ప స్వామి ఆలయానికి రూ.50లక్షలు, కడెం మండలం నచ్చన్‌ఎల్లాపూర్ పంచాయతీ పరిధి కొత్తపల్లిలో హనుమాన్ మందిరానికి రూ.12లక్షలు, పెంబి మండలం ఇటిక్యాల గ్రామంలో శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి రూ.25లక్షలు, కోసగుట్ట గ్రామంలో హనుమాన్ ఆలయానికి రూ.12లక్షలు, షెట్‌పల్లి గ్రామంలోని శ్రీ బాలాజీ మందిరానికి రూ.15లక్షలు, నల్లమడుగులోని హనుమాన్ ఆలయ నిర్మాణానికి రూ.12లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

మేదరి సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సత్యనారాయణ

ఖానాపూర్: మేదరి సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఖానాపూర్‌లోని శాంతినగర్ కాలనీకి చెందిన మదిర సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం వరంగల్‌లోని శ్రీ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన రాష్ట్ర సంఘం సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు జె.శ్రీనివాస్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. అనంతరం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిలువేరు లక్ష్మీనర్సయ్య, ఊరే దశరథ్, ఎనగందుల రాజు, మదిరె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

కడెం: ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన పి.సాయికిరణ్‌ను బీజేపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సైకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు అమరవేణి రవీందర్‌గౌడ్, ముక్కెర గంగాధర్, ముల్కి కృష్ణ, ప్రవీణ్, ప్రసాద్, తిరుమల్, రాజేశ్, వేణు, నల్లగొండ, తదితరులున్నారు.

ఆలయం ప్రారంభించాలని వినతి

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టాలని కోరుతూ ఆదివారం మండలంలోని కౌట్ల(బి) గ్రామస్తులు ఆలయ కమిటీ చైర్మన్ భోజాగౌడ్, ఈఓ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. వచ్చే సెప్టెంబర్ 27, 28వ తేదీల్లో నిర్వహించే గంగనీళ్ల జాతరకు పూజాది కార్యక్రమాలు నిర్వహించేందుకు రెండు నెలల సమయం పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు ఉన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

భైంసారూరల్: మండలంలోని వాలేగాం గ్రామంలో ఆదివారం భైంసాలోని అరుష్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యులు బందెల నరేశ్ సుమారు 100 మంది చిన్నారులను పరీక్షించి మందులు అందించారు. కార్యక్రమంలో మాణిక్‌రావు, శ్యామ్‌రావు, రాందాస్, దిగంబర్, కిశోర్, అశోక్, మారుతి గ్రామస్తులు ఉన్నారు.

ఆషాఢమాస ఉత్సవాలు ప్రారంభం

తానూరు: తొలి ఏకాదశి పండుగ పురస్కరించుకొని మండలకేంద్రంలోని విఠలేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢమాస ఉత్సవాలు ఆదివారం ప్రారంభమైనట్లు పూజారి పింటు మహరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. మహారాష్ట్రలోని పండరిపురంలోని విఠల్వేరస్వామి ఆలయంలో నిర్వహించే కార్యక్రమాలు ఈ ఆలయంలో చేపడుతారు. ఈనెల7 నుంచి 11వరకు గ్రామాల్లో పల్లకి ఊరేగింపు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి

భైంసాటౌన్: దేశంలో ఒకే ఎన్నిక, ఒకే చట్టం ఉండాలని పోరాడిన మహానేత శ్యామాప్రసాద్ ముఖర్జీ అని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్ ఫ్యాక్టరీలో శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి నిర్వహించారు. ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణాధ్యక్షుడు రావుల రాము, సాయినాథ్, పోశెట్టి కార్యకర్తలు పాల్గొన్నారు.

మామడ: శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. మామడలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ మండల కన్వీనర్ రంజిత్‌కుమార్, లక్ష్మి, సురేందర్, పవన్‌కుమార్, భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సోన్: మండలకేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు మార గంగారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మొక్కలు నాటారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దావా సాయన్న, నాయకులు మొత్కపల్లి నరేశ్, ప్రధాన కార్యదర్శి మామిడాల సంతోష్, నర్సయ్య, గణేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని చుచుంద్ గ్రామంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షురాలు సుష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయినాథ్, రాకేశ్, భూమేశ్, శ్రీనివాస్, శివ, నాగన్న, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ మండలాధ్యక్షుడు కాల్వ నరేశ్ , శ్రావణ్‌కుమార్, వీరయ్య, సాహెబ్‌రావు, చెన్న రాజేశ్వర్, సాగర్‌రెడ్డి, నర్సయ్య, రాజురెడ్డి, ఎల్లన్న, విలాస్, నారాయణ తదితరులున్నారు.

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామంలో శ్యామాప్రసాద్‌ముఖర్జీ జయంతి నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్‌యాదవ్ నాయకులతో కలిసి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మొక్కలు నాటారు. క్లెం రమణారెడ్డి,సత్తెన్న, గంగాధర్, శ్రీనివాస్, ప్రసాద్ ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి నిర్వహించారు. బీజేపీ నాయకులు ఆకుల శ్రీనివాస్, అంకం మహేందర్, ఉపేందర్, మనోజ్, నాయిని సంతోష్, సత్యవతి, అనిల్‌రావు, నారాయణ ఉన్నారు.

లోకేశ్వరం: మండలకేంద్రంలోని స్వామి వివేకానంద చౌరస్తా వద్ద శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ మండల కన్వీనర్ బోడికే సాయన్న, ముధోల్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్ కుమార్, శ్రీధర్, రమేశ్, విలాస్, సంజీవ్‌రెడ్డి, మేకల రమేశ్ ఉన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరులో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ మండల కన్వీనర్ పసుల నవీన్, బూత్ కన్వీనర్ శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్‌చార్జి దిగంబర్ పటేల్, నాయకులు పాల్గొన్నారు.



భైంసాలో పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, నేతలు



సోన్‌లో..



ఖానాపూర్‌లోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో..


నిర్మల్ డాక్టర్‌కు అవార్డు

నిర్మల్‌టౌన్: మెడికల్ సర్వీస్ విభాగంలో చెన్నైలో ఇండియన్ ఉమెన్ అచీవర్స్ అవార్డ్స్–2025 వేడుకను నిర్వహించారు. మహిళల ఆరోగ్యం, సంతానలేమి చికిత్సలో పట్టణానికి చెందిన డాక్టర్ చంద్రిక చేసిన కృషికి గుర్తింపుగా పురస్కారం లభించింది.

ఆర్టీసీలోనే సురక్షిత ప్రయాణం

కుంటాల: ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం సుఖవంతంగా ఉంటుందని భైంసా డిపో పర్యవేక్షకుడు సరియా అజ్మీర పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఓలా, కుంటాల గ్రామాల్లో ఆర్టీసీ సేవలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. మహాలక్ష్మి పథకంతోపాటు భైంసా డిపో నుంచి అరుణాచలం, కాణిపాకం, మధురం మీనాక్షి, రామేశ్వరం, శ్రీరంగం, అన్నవరం, పలని, భద్రాచలం, శ్రీశైలం, పాతాళ గంగా వంటి పుణ్యక్షేత్రాలకు బస్సులు నడుపుతున్నామని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్, గజ్జారాం యాదవ్, గంగాధర్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



కుభీర్‌లో పీరీలను ఊరేగిస్తున్న ప్రజలు

లోకేశ్వరం: మత సామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం సందర్భంగా మండలంలోని రాయపూర్‌కాండ్లీ, లోకేశ్వరం గ్రామాల్లో ఆదివారం పీరీల ఊరేగింపు నిర్వహించారు. పీరీలకు మలిదలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కుభీర్:మొహర్రం సందర్భంగా ఆదివారం మండలకేంద్రంలోని వీధుల్లో పీరీల ఊరేగింపు నిర్వహించా రు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు తీర్చు కు న్నారు. పలువురు నాయకులు ఎక్బాల్, ఎజాజ్, అహ్మద్ తదితరులు ఉన్నారు.